# కలెక్టర్ భారతి హోళికేరీపై బదిలీ వేటు

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు పూర్తి అదనపు బాధ్యతలు
- జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు రిపోర్టు చేయాలని హోళికేరీని ఆదేశించిన సీఎస్
- ధరణిలో జరిగిన అక్రమాల నేపథ్యంలోనే హోళికేరీపై వేటు
- రెండున్నర నెలల వ్యవధిలోనే ఇద్దరు కలెక్టర్లపై బదిలీ వేటు
- అక్రమార్కుల్లో దడ పుట్టిస్తున్న ప్రభుత్వ చర్యలు



రంగారెడ్డి, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : భారతి హోళికేరీకి బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది. అక్టోబర్ 13న ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. విధులు నిర్వర్తించిన 73 రోజుల వ్యవధిలోనే ఆమెపై కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొట్రుకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్‌పై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో ఆయనపై బదిలీ వేటు పడింది. రంగారెడ్డి జిల్లాలో ఇటీవల ధరణి పోర్టల్‌లో జరిగిన భారీ భూ కుంభకోణమే ఇందుకు కారణమన్న ప్రచారం జరుగుతున్నది. కోర్టు కేసులు, పాసు పుస్తకాల్లో డేటా మార్పు, పెండింగ్ మ్యుటేషన్ వంటి దరఖాస్తులు ధరణిలో అక్రమంగా నమోదయ్యాయి. క్షేత్రస్థాయిలో తహసీల్దార్‌తోపాటు ఇతర అధికారుల విచారణ రిపోర్టులేవీ లేకుండానే దరఖాస్తులకు ఆమోదం లభించినట్లు అక్రమార్కులు ధరణిలో నమోదు చేశారు. జిల్లా నలుమూలల్లో విలువైన భూములకు సంబంధించిన 98 దరఖాస్తులు అక్రమంగా ధరణి పోర్టల్‌లో ఆమోదం పొందగా.. ఈ అక్రమంలో రూ.కోట్లు చేతులు మారినట్లు సమాచారం. అధికారులంతా అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉన్నప్పుడు అక్టోబర్ 4 నుంచి నవంబర్ 11 మధ్యనే ఈ వ్యవహారం నడిచింది. ధరణి కో-ఆర్డినేటర్ నరేశ్, ఆపరేటర్ మహేశ్‌లను బాధ్యులుగా చేసి వారిపై ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుగుతున్న సమయంలోనే జిల్లా కలెక్టర్ భారతి హోళికేరీపై బదిలీ వేటు పడడం చర్చనీయాంశమవుతున్నది.

### దడ పుట్టిస్తున్న ప్రభుత్వ చర్యలు

రంగారెడ్డి జిల్లాలోని ధరణి పోర్టల్‌లో అక్రమంగా నమోదు చేసిన 98 దస్ర్తాలకు సంబంధించిన విచారణ కొనసాగుతున్నది. ఇప్పటికే ధరణి కో-ఆర్డినేటర్ నరేశ్, ఆపరేటర్ మహేశ్‌లను పోలీసులు అదుపులోకి విచారణ జరిపినప్పటికీ కీలక అంశాలేవీ వెల్లడి కాలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే 98 దస్ర్తాలు ఎవరికి సంబంధించినవి? ఏ ప్రాంతానికి సంబంధించినవి? తదితర వివరాల కోసం పోలీసులు సీసీఎల్‌ఏకు లేఖ రాశారు. ఆ వివరాల ఆధారంగా సమగ్ర దర్యాప్తు జరిపేందుకు పోలీసులు నిర్ణయించారు. సీసీఎల్‌ఏకు పోలీసులు లేఖ రాసి పదిహేను రోజులు అవుతున్నప్పటికీ ఇంతవరకు దస్ర్తాలకు సంబంధించిన వివరాలేవీ రాలేదని తెలిసింది. దీంతో పోలీసుల దర్యాప్తులో జాప్యం జరుగుతున్నది. ఇదే క్రమంలో దర్యాప్తును తొక్కిపెడుతున్నారన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

రూ.కోట్ల కుంభకోణంపై ఇప్పటివరకు కలెక్టర్ భారతి హోళికేరీ పత్రికాముఖంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకే జిల్లా కలెక్టరేట్ ఏవో ఫిర్యాదు చేసినప్పటికీ.. కలెక్టర్ మౌనంగా ఉండడం ఎన్నో అనుమానాలకు తావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే అనూహ్యంగా కలెక్టర్‌పై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం.. ఆమెకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ధరణి వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ ఘటనతో ధరణి అక్రమాలపై పూర్తి స్థాయి విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇక పారదర్శకంగా విచారణ సాగితే ధరణి అక్రమాల డొంక కదలనుంది. ప్రస్తుత పరిస్థితులు అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి.

### జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా గౌతమ్ పొట్రు



ఇబ్రహీంపట్నం, డిసెంబర్24: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా గౌతమ్ పొట్రును నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన భారతి హోళీకేరీని సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు ఇవ్వవలసిందిగా ప్రభుత్వం ఆమెను ఆదేశించింది. గౌతమ్ పొట్రు (ఎఫ్‌ఏసీ) 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. జిల్లాలో సమర్థవంతమైన పాలన అందించేందుకు కృషి చేయనున్నట్లు గౌతమ్ పొట్రు పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని విధాలుగా సహకరించాలని ఆయన కోరారు.

# నిత్య ధ్యాన సాధనతో ఆనందమయ జీవితం

- పరిమళ పత్రీ
- మహాయాగంలో పాల్గొన్న ఆధ్యాత్మిక గురువులు, పిరమిడ్ మాస్టర్లు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





ధ్యానులనుద్దేశించి మాట్లాడుతున్న పరిమళ పత్రీ, మహాయాగంలో పాల్గొన్న ధ్యానులు

కడ్తాల్, డిసెంబర్ 24 : నిత్య సాధనతో ఆనందయ జీవితాన్ని గడపవచ్చని.. అహింస, ధ్యానం, సేవ, సత్యంపై పీఎస్ఎస్ఎం నిలబడిందని ధ్యాన గురువు పరిమళ పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుభాశ్ పత్రీజీ ధ్యాన మహాయాగం-2 ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు ప్రాతఃకాలంలో నిర్వహించిన సంగీత ధ్యానానికి ధ్యానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రీ మాట్లాడుతూ.. ధ్యానంతో సుభాష్ పత్రీజీ అతి పెద్ద సామ్రాజాన్ని నిర్మించుకున్నారని తెలిపారు. ప్రపంచశాంతికి పత్రీజీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. నిత్య ధ్యానం, శాఖాహార జగత్ నిర్మాణమే ధ్యానుల లక్ష్యమని పేర్కొన్నారు. ధ్యాన ప్రచారంలో ధ్యానులు చేస్తున్న కృషి అద్భుతమన్నారు. ప్రతి ఒక్కరికి సులువైన ఆనాపానసతి ధ్యానాన్ని సుభాష్ పత్రీజీ అందజేశారన్నారు. ఆత్మజ్ఞానంతో కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం వెల్లువిరిస్తుందన్నాదని తెలిపారు. సమాజంలో గురువే ప్రత్యక్ష దైవమని, పత్రీజీ ఎంతో మందిని ధ్యాన, జ్ఞాన మార్గంలోకి తీసుకవచ్చారని ఆమె పేర్కొన్నారు. తమ పిల్లలకు తల్లిదండ్రులు చిన్నతనం నుంచే ధ్యానాన్ని నేర్పించాలన్నారు.

ధ్యాన సభలో పాల్గొన్న విదేశీ వనితలు జెన్నిఫర్, ఏమీలు తమ అనుభవాలను ధ్యానులకు వివరించారు. అనంతరం ఆధ్యాత్మిక గురువులు రచించిన స్పిరిచ్యువల్ ఇండియా మానస పత్రిక, క్యాలెండర్, ఓషో రజనీశ్ రచించిన జీవిత రహస్యాలు తెలుగు పుస్తకం, పండంటి రాజమణి రంచించిన అగ్నిస్పర్శ, పిరమిడ్ పైమా రూపొందించిన సోల్ ఫుల్ జర్నీ పుస్తకాలను ఆవిష్కరించారు. పిరమిడ్‌లో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలకు చేవెళ్ల నియోజకవర్గం రామన్నగూడెం గ్రామ సర్పంచ్ రూ.2 లక్షల విరాళం అందజేశారు. అనంతరం కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానులను అలరించాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు సాంబశివరావు, హన్మంతురాజు, దామోదర్‌రెడ్డి, శ్రీరాంగోపాల్, శివప్రసాద్, రాంబాబు, మాధవి, జయశ్రీ, లక్ష్మి పాల్గొన్నారు.

# కులకచర్ల ఓటర్ల అవస్థలు తొలగించండి

**చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి**



దోమ, డిసెంబర్ 24 : కులకచర్ల మండలంలో 36 గ్రామపంచాయతీలుండగా.. కేవలం 47 కేంద్రాలున్నాయి. దీంతో స్థానిక ఓటర్లు అవస్థ పడటాన్ని ఎంపీ రంజిత్‌రెడ్డి గమనించారు. ఎంపీ సూచన మేరకు ఎంపీ ఆఫీసు సిబ్బంది కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి.. ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలను విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన కలెక్టర్ అవసరమైన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మండల పరిధిలోని లాల్‌సింగ్‌తండా, బండమీదితండా, బోజ్యానాయక్‌తండా, గోగ్యానాయక్‌తండా తదితర 12 గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు లేవన్నారు. దీంతో పోలింగ్ సమయంలో వృద్ధులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు ఓటు వేసేందుకు ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. స్థానికుల విజ్ఞప్తుల మేరకు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టేలా కార్యాచరణను సిద్ధం చేయాలని ఎంపీ కలెక్టర్‌ను కోరారు.

# 27న యోగా, మెడిటేషన్ సెంటర్ ప్రారంభం



జేవీఆర్ పార్కులో జోనల్ కమిషనర్‌తో కలిసి పనులను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : జలగం వెంగళరావు పార్కు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రేతో కలిసి మేయర్ జేవీఆర్ పార్కులో జరుగుతున్న పనులను ఆదివారం పరిశీలించారు. పార్కులో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. యోగా, మెడిటేషన్ సెంటర్ పనులు పూర్తయినందున 27న ఉదయం 6.30 గంటలకు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### క్రిస్మస్ శుభాకాంక్షలు

క్రిస్మస్ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని మేయర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజాపాలనకు పటిష్ట కార్యాచరణ

- 28 నుంచి వచ్చే నెల 6 వరకు ప్రతి వార్డులో ప్రజాపాలన
- సమీక్షలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ వెల్లడి

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ): ప్రజాపాలనను సమర్థవంతంగా నిర్వహించడానికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు, జోనల్ అధికారులు 150 వార్డులవారీగా పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, భారతి హోళికేరీ, జోనల్ స్థాయి అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజా పాలనకు సంబంధించి వార్డులవారీగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన నేపథ్యంలో భాగంగా మహాలక్ష్మి, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రతి వార్డులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 6 గంటల వరకు షిఫ్టుల వారీగా దరఖాస్తులను స్వీకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ సూచించారు. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత వారికి రిసిప్టులు జారీ చేస్తారని తెలిపారు. నమూనా దరఖాస్తులు అవసరమైనవి ప్రింట్ చేసి ఇవ్వాలని, ప్రజలు దరఖాస్తుతో పాటు తమ ఆధార్ కార్డును రేషన్‌కార్డును జత చేయాలన్నారు.

### గ్రేటర్‌లో బదిలీలు

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఆదివారం అధికారుల బదిలీలు జరిగాయి. జీహెచ్ఎంసీలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శృతి ఓజాను ఇంటర్ బోర్డు కార్యదర్శిగా నియమించారు. రాచకొండ సీపీగా పనిచేసిన డీఎస్ చౌహాన్ (ఐపీఎస్)కు సివిల్ సప్లయ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు.